అల్లరి

ALLARI



# హవా మహల్లు!

**ఇది గూడ అకుబర్** – బీరుబల్ కతనేనుల్లా! ఒకసారి మాపటీలి బువ్వదిన్నింక బంగ్లమీద గూసొని.. అకుబర్ – బీరుబల్ మాట్లాడుకో వట్టింద్రు. ఆ మాటలల్ల హవా మహల్ల (గాలి బంగ్లలు) ముచ్చట అచ్చింది. ఎంటనే.. ''గాలి బంగ్లలంటే ఎట్లుంటయి? అవ్వి గట్టనీకి ఎంతైతది?'' అంట అడిగిండు అకుబర్. దానికి బీరుబల్.. ''హుజూర్! అవి గట్టుడు అందరితోని గాదు. కట్టినా.. అంత అగ్గువల గాదు!'' అంట చెప్పిండు. ఇచ్చిత్రం అనిపిచ్చి, అకుబర్ ఎంటనే.. ''నాకు గాలిమేడలు సూడాలని కాయిషుగున్నది. ఎంత కర్సు అయినా.. ఎన్కముందాడకు. జల్దిన పని షురూ చేయించు!|'' అంట ఫర్మానేశిండు. ఇంక అన్నడు గదా!.. ''ఒకటి రెండంత్రాలు గాదు.. ఎన్ని అంత్రాలు గట్టస్తె.. అన్ని గట్టు! నీ పేరు, నాపేరు నిలిశిపోవాలె!'' అంట చెప్పిండు అకుబర్. ఆ దినం కెల్లి బీరుబల్ కచేరికి అచ్చుడులేదు. ఆరం పది దినాలైంది. బీరుబల్ ఎందుకు అత్తలేడో అర్సుకొమ్మని చెప్పిండు అకుబర్. 'పనోల్ల కోసం తిరుగుతున్న! ఆళ్లు దొరుకంగనే అచ్చి పాదుషాను కలుస్త!' అంట చెప్పి పంపిండు బీరుబల్. పదిగేనొద్దులకు కచేరికి ఒకాయినెను తోల్కొని అచ్చిండు బీరుబల్. ''నీ గాలి బంగ్లలు గట్టుడు ఏడిదాక అచ్చింది?'' అంట అడిగిండు అకుబర్. ''హుజూర్! గందుకే ఈనెను తీస్కచ్చిన. మీరు కొంచెంసేపు నిమ్మలంగుంటే.. గాలి బంగ్లను సూడచ్చు'' అన్నడు బీరుబల్. ''అన్నట్టు చెప్పుడు మరిశిన.. మన రాజ్యంల గాలి బంగ్లలు గట్టుట్ల ఈనెను మించిన సిపాయి లేడు!'' అని మల్ల చెప్పిండు. ''నువ్వు మస్తు పనిమంతునివని బీరుబల్ చెప్తుండంటె.. నువ్వు మామూలోనివి గానట్టె! నీ పేరేంది? ఉరేంది? ఏమేం చేత్తవో చెప్పు!'' అన్నడు అకుబర్. దానికాయినె అంగి అంగి సలాం జేసి.. ''హుజూర్! నా గురించి ఏమేం చెప్పాలె!? ఎన్ని చెప్పాలె!? చెప్పుకొంటె తెల్వది. చెప్పితె ఒడువది. నాది పెద్ద కత. మా అవ్వా – నాయినకు లేకున్నా.. కోట్లు కర్సు వెట్టి నన్ను పెంచింద్రు. ఇల్లు జాగ లేకున్నా.. మేడల్ల ఉంచింద్రు. మా ఊరికి మస్తుమంది పయిల్వాన్లు అద్దురు. ఏడేండ్లప్పుడే ఆల్లందర్నీ ఓడిచ్చిన! అంబాడేటప్పుడే.. కుస్తీ వట్టుడు నేర్శిన. నా పేరు చెప్తే గజదొంగలు ఉచ్చవోసుకుంటరు. ఇయ్యాల మిమ్ముల్ని ఖుషీ చేసి.. చిన్న జాగీరు దీసుకుందమని అచ్చిన. ఆ జాగీరుతోని ఇంకొన్ని జాగీర్లు జమ జేసుకొని రాజునైత. రాజునైనంక ఆల్లనీల్లను గలుపుకొని, మారాజునైత.. అటెన్క పాదుషానైత!'' అంట ఇంకేదో జెప్పవోయిండు. ఎంటనే అకుబర్.. ''చల్ ఆపు! ఏందేందో అనాప్ సునాప్ ఒర్రుతున్నవ్! ఉత్త దేడ్ దిమాక్‌గానివి. నువ్వేం గాలి బంగ్లలు కడుతవు!? బీరుబల్.. గీన్నెందుకు దెచ్చినవు? గీడేం గాలి బంగ్లలు కడుతడు?'' అంట కోపానికచ్చిండు. గప్పుడు బీరుబల్.. ''మాఫ్‌కర్నా హుజూర్! గాలి బంగ్లలు, హవా మహల్లు కట్టుడంటే.. గీ తుపాకి రాముని ముచ్చటే!'' అంట అనేటాల్లకు.. అసలు ముచ్చట దెలిశి, అందరు నవ్విండ్లు.

**... ✍ పత్తిపాక మోహన్**



## మీకు తెలుసా?

మన భాష తెలుగు. అందరూ ఈ భాషలోనే సంభాషించుకుంటాం. అలాగే, ఒక్కో రాష్ట్రంలో ఒక్కో ప్రధాన భాష మాట్లాడుతారు. అయితే, తుర్కియేలోని కుష్కోయ్ అనే గ్రామ ప్రజలు మాత్రం.. ఈలలతోనే మాట్లాడుకుంటారు. 'కుష్కోయ్' అంటే పక్షుల భాష అని అర్థం. ఇక్కడి ప్రజలు 400 ఏండ్లుగా ఈల భాష (విజిల్ లాంగ్వేజ్)లోనే సంభాషించుకుంటున్నారు. అంతేకాదు.. యునెస్కో దీన్ని భాషగా అంగీకరించింది. వారసత్వ సంపదగానూ గుర్తించింది.

## చెప్పుకోండి



- వింత కాదు.. విడ్డూరం కాదు! అయినా అది వస్తే మాత్రం నోరు తెరుస్తారు?
  **- ఆవులింత**
- అందరిలో చిన్నోడు. పెళ్లికి మాత్రం పెద్దోడు?
  **- చిటికెన వేలు**
- సంతలన్నీ తిరుగుతాడు. సమానంగా పంచుతాడు?
  **- త్రాసు**

## మంచిమాట



**విజయమే జీవితం కాదు!**
**ఓడిపోవడం అంటే.. అన్నీ కోల్పోవడం**
**అసలే కాదు! గెలుపోటముల్ని సమానంగా**
**స్వీకరించడమే జీవితం!**

## పద్యం - భావం



**పురికిని బ్రాణము కోమటి**
**వరికిని బ్రాణంబు నీరు వసుమతిలోనం**
**గరికిని బ్రాణము తొండము**
**సిరికిని బ్రాణమ్ము మగువ సిద్ధము సుమతీ!**

**తాత్పర్యం :** ఈ లోకంలో ఊళ్లు, పట్టణాలకు వ్యాపారులే ఆధారం. వరిచేనుకు నీరే ఆధారం. ఏనుగుకు తొండం.. సంపదకు స్త్రీ ఆధారం. ఈ విషయాలను ఎల్లప్పుడూ గుర్తించి మెలగాలి అని భావం.